



# 911 ఫోన్ చేస్తే చాలు...

**ఇండియాకు తొందరగా వెళ్లాలి! అబ్బ! భారతదేశాన్ని చూసి ఎన్ని సంవత్సరాలు అయిందో! భారత్‌లో అందునా హైదరాబాద్ గాలి పీల్చి, అక్కడ సరదాగా గడిపి ఎంత కాలం అయిందో? ఎంత త్వరగా స్వంత గడ్డలో కాలు పెడతానా అనుకుంటూ ఆలోచనలతో సతమత మవుతున్నాడు రంజిత్ సింగ్.**

తనతో పాటు కొడుకు కులదీప్‌ని తీసుకెడతానని చెప్పాడు భార్యతో.

“వాడికీ మీకూ చుక్కెదురు. ఒక్క క్షణం కూడా ఇద్దరికీ పడదు. ఎందుకు వాడిని తీసుకెళ్లడం? మనశ్శాంతి లేకుండాపోయిందని సణుక్కోడం ఎందుకు?” అని భార్య, కూతురు అడ్డు చెప్పినా వినలేదు.

గతం గుర్తొచ్చింది.

తగిన ఉద్యోగం, దానికి తగ్గ ఆదాయం లేక, వచ్చే జీతం పెళ్లాం, బిడ్డలను పోషించడానికి సరిపోక, సరదాలు, లగ్జరీల గురించిన ఆలోచనలు, కోరికలు మనసులోనే చంపుకుంటూ, వాటి ప్రస్తావన తెచ్చిన కుటుంబసభ్యులపై చిర్రుబుర్రులాడుతూ మనశ్శాంతి లేకుండా ఇలా ఎంత కాలం అనిపించేది అప్పట్లో, హైదరాబాద్‌లో ఉన్నప్పుడు రంజిత్‌కి.

మిగతా స్నేహితులు తన కంటే తక్కువ అర్హతలు ఉన్నా వి.ఐ.పి.లను, పెద్ద రాజకీయనాయకులను పట్టుకొని సునామీ (బహుమతి, కానుకల పేరుతో డబ్బుని, విలువైన వస్తువులను) దండిగా చెల్లించి పాస్ పోర్టులు, వీసాలు సంపాదించుకుని అమెరికా వెళ్లి సెటిలైపోయారు. పనికి రాని ఆవేశం వల్ల, లౌక్యం తెలియకపోవడం వల్ల పని జరగక తను భారత్‌లో ఉండి పోయాడు. ఒక్కోసారి వాళ్లపై అసూయ ఏర్పడేది. అమెరికాలో స్థిరపడిన ఆప్తమిత్రుడి ప్రోత్సాహం, ఆర్థికసాయం, ఇతరసహాయాల వల్ల ఆరేళ్ల తరువాత తనూ చేరుకోగలిగాడు అమెరికా.

మంచి జీతంతో వెంటనే ఉద్యోగం దొరికింది. దొరికిన ఉద్యోగంతో సేద తీరిపోకుండా, పార్ట్ టైమ్‌గా ఆడ్ జాబ్‌లు కూడా చేస్తూ, రోజుకి పదిహేడు గంటలు కష్టపడుతూ పొదుపు పాటించాడు. పొదుపునంతా బ్యాంక్‌లో నిల్వవేసి, తన కుటుంబ సభ్యులకు అమెరికాలో వసతి చూడగలనని, ఆర్థికసమస్యలు రాకుండా పోషించగల నని. ఆవారాల్లా వాళ్లని గాలికి వదలనని తగు హామీలు చూపించి, అయిదేళ్ల తర్వాత వారిని అమెరికా రప్పించగలిగాడు రంజిత్.

పదో యేడు వచ్చిన కూతురు రూప సౌమ్యురాలు. అన్నిటికీ సర్దుకుపోగల తత్వం ఆమెది. ఆరో ఏడు వచ్చిన కుల్వంత్, భారత్‌లో ఉన్నప్పుడే మట్టగిడస లా తయారయ్యాడు. పెంకితనం ఎక్కువ. పట్టుదలా ఎక్కువే. తను అన్నది, అడిగింది కాదంటే, అది జరిగేవరకూ ఉలుకూ పలుకూ ఉండదు. తిండి తినడు. నిద్ర పోడు. ఏదో కోల్పోయినవాడిలా ఓ మూలకు చేరి ప్రపంచం పట్టకుండా దిగులుగా కూర్చుంటాడు. అమ్మ పెట్టే రెండూ పెడితే గాని, పల్లకీ ఎక్కనని మొండికేసే పెళ్లికూతురిలా, ఆ రెండో నాలుగో పడితే గాని, దారికి రాని మనస్తత్వం కులదీప్ ది. భారత్‌లో ఉండగానే అందరి గారాబం వల్ల అలా తయారయ్యాడు.

అమెరికాలో న్యూ జెర్సీకి కుటుంబసభ్యులందరూ వచ్చిన తరువాత, అందరూ ఆనందంగా ఉన్న సమయంలో, 911కి ఫోన్ చేస్తే అత్యవసరంగా పోలీసులు (కాప్స్) వచ్చి ఆపదలో ఆదుకుంటారని, అక్కడ పోలీసులు స్నేహితుల్లా, ఆప్తబంధువుల్లా సాయపడతారని సోదాహరణంగా వివరించాడు. స్త్రీలు, పిల్లలు వృద్ధుల విషయంలో మరింత ప్రాధాన్యమిస్తారని చెప్పాడు. పిల్లలని, స్త్రీలని, వృద్ధులని కొట్టడం, భయంకరంగా తిట్టడం, లైంగికంగా వేధించడం అమెరికా చట్టప్రకారం తీవ్రనేరాలని తెలిపాడు. ఈ విషయాలన్నీ పూసగుచ్చినట్టు చెప్పడం, భవిష్యత్తులో మరోలా పరిణమిస్తుందని, రంజిత్‌సింగ్ అప్పుడు ఊహించలేదు. పాఠశాలల్లో ఈ అంశాలే పదే పదే వివరిస్తారని

అప్పుడప్పుడు తలిదండ్రుల నుంచి గాని, ఇరుగుపొరుగు నుంచి గాని ఆ పిల్లలు ఇబ్బందులు ఏవైనా ఎదుర్కొంటున్నారా అని పాఠశాలల్లో తెలుసుకుంటారని రంజిత్‌కి తెలీదు.

తలిదండ్రుల్ని కులదీప్ తరచూ విసిగించి వేసారేట్టు చేసేవాడు. వారాంతంలో (శని, ఆదివారాల్లో) అయితే మరీ ఏడిపించేవాడు. స్నేహితుల పిలుపు మేరకు ఏదో ఫంక్షన్‌కి వెళ్లడానికి, లేదా సరదాగా ఎక్కడో గడపడానికి ఏర్పాట్లు చేసుకుంటే, చివరి నిముషంలో అందుకు భిన్నంగా మరో చోటికి కనీసం 400 మైళ్ల దూరం ఉండే ప్రాంతానికి వెళ్లితీరాల్సిందే అని మంకుపట్టు పట్టేవాడు. ఆరోగ్యం బాగాలేదు కనుక ఈ వారాంతంలో ఎక్కడికీ వెళ్లకుండా ఇంటిలోనే గడుపుదామని అందరూ అనుకుంటే, నయాగరా ఫాల్స్ లేదా వైట్ హౌస్ ఇలా ఏదో చూడాలని మరాం చేసేవాడు.

పోనీలే పిల్లాడు, వాడి ముద్దుముచ్చట్లు మనం తీర్చకపోతే దేశం కాని దేశంలో ఇంకెవరు తీరుస్తారు అనే ఉద్దేశ్యంతో, చాలా సార్లు సర్దుకుపోయినా, కొన్ని సందర్భాలలో చికాకు, కోపంతో బెల్టు తీసుకుని బాదటమో, చెంపలు వాయకొట్టడమో, పిక్కబాసం పెట్టడమో చేయక తప్పేది కాదు రంజిత్‌కి. తల్లి ఎప్పుడైనా అలా చేస్తే మిన్నకుండే కులదీప్, తండ్రి విషయంలో రాద్ధాంతం చేసేవాడు. మరింత బిగుసుకుపోయేవాడు.

బ్రెడ్‌కి జామ్‌లా, చపాతీలో కూరలా, బూట్లకు మేజోడులా ఉపయోగపడుతుందనే ఆశతో చుట్టు పక్కల ఉద్యోగార్థమై వచ్చి, పెళ్లయి, బ్రహ్మచారి జీవితం గడుపుతూ, తిండికి మొహం వాచిన భారతీయులకు తిండి సదుపాయం కల్పిస్తూ, ఒక్కొక్కరి నుంచీ నెలకు వందో, నూట యాభై డాలర్లు సంపాదించేది, రంజిత్‌సింగ్ ప్రోత్సాహం తో, భార్య. వారాంతంలో అలాంటివారు కూడా ఇంటికి లంచ్‌కో, డిన్నర్‌కో వస్తే, కులదీప్ మంకుతనం మరింత పేట్రేగి పోయేది. కావాలని తండ్రిని బాగా రెచ్చ గొట్టేవాడు.

> “బాగా చీకటి పడ్డాక, పొలానికి సమీపంలో రోడ్ మీద టాక్సీని ఆపాడు. కొడుకుని తీసుకుని పొలంలోకి వెళ్లాడు. కోపంతో రంజిత్ ముక్కుపుటాలు అదురుతున్నాయి. చెమటలు విపరీతంగా పట్టసాగాయి. చెయ్యని నేరంలో నన్ను ఇరికించి జైలు పాలుచేసి నరకయాతన పెట్టినందుకు నీకిదే శిక్ష అనుకుంటూ బెల్ట్ తీశాడు.”

ఇలా మూడేళ్లు గడిచిపోయాయి.

వేసవిలో ఓ శనివారం, ఎక్కడికీ వెళ్లే ఉద్దేశ్యం లేని కుటుంబాల వారికి తెల్లారినట్టే, ఉదయం పది గంటలకి రంజిత్ కుటుంబానికీ తెల్లారింది. నిద్ర లేస్తూనే తన ప్రతాపం చూపుతూ, పొద్దు పెరిగే కొద్దీ రెచ్చిపోయే భానుడిలా కులదీప్ రెచ్చిపోసాగాడు. తల్లీ, అక్కా మందలించినా ప్రయోజనం లేకపోయింది. అలాటప్పుడు విసిగిన తండ్రి నుంచి లభించే తాయిలం అందకపోయేసరికి, గదిలోకి వెళ్లి తలుపువేసుకున్నాడు కులదీప్.

ఎవరి పనుల్లో వాళ్లున్నారు.

బజర్ మోగింది.

రంజిత్ తలుపు తీశాడు.

ఇంటి నంబరు, ఫోన్ వివరాలు అడిగే పోలీసులను చూసి, బిత్తరపోయాడు రంజిత్. అతడిని పక్కకు తప్పించి పోలీసులు ఇద్దరూ హాల్‌లోకి వెళ్లారు.

ఇదంతా కిటికీలోంచి గమనిస్తున్నాడు కులదీప్. ఆశ్చర్యంతో తల మునకలవుతున్న తండ్రి దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్లి తన ముంజేతి నుండి కారే రక్తాన్ని తండ్రి చేతులకు అంటించాడు. బెల్టుని చప్పుడు కాకుండా ఓ మూలకి కనిపించే విధంగా విసిరాడు.

రంజిత్ ఈ విషయాలు గమనించలేదు.

హాల్‌ని పరిశీలించి వెనుతిరిగిన పోలీసులకు, తండ్రి పక్కన, రక్తం కారే చేతులతో కళ్లమ్మట బొటబొట నీరు కార్చే కొడుకు కనిపించాడు.

“ఏమైంది?” అని పోలీసులు ప్రశ్నించగానే, వెక్కివెక్కి ఏడ్చాడు కులదీప్. తన తండ్రి తరచు తనని ఇలాగే హింసిస్తాడని ఒక్కోసారి ఆ రోజున తిండి కూడా పెట్టడని రుద్ధకంఠంతో చెప్పి హాల్ దద్దరిల్లేలా ఏడిచాడు.

ఆ ఏడుపుతో వంట గదిలో ఉన్న తల్లి, అక్క పరిగెత్తుకు వచ్చి, పోలీసులని, అక్కడున్న దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయారు. వాళ్లకి కులదీప్ కాళ్ల మీద తట్టు తేరిన బెల్ట్ దెబ్బలూ కనిపించాయి.

అంతకు ముందు రోజు రాత్రి, భార్యాకూతుళ్లతో “ఇక నుండి కులదీప్‌ని ఎట్టి పరిస్థితిలోనూ కొట్టకుండా తిట్టకుండా శాంతి సహనాలతో తీర్చి దిద్దుతాను” అని ఒట్టు వేసుకున్న విషయం, వాళ్లకు గుర్తొచ్చింది. బజర్ మోగేవరకు అతడు తమ దగ్గరే ఉన్న విషయమూ వాళ్లకి తెలుసు. అందుకే “ఈ దెబ్బలేంటి? బయట ఎవరితో తగాదా పడ్డావు?” అని ప్రశ్నించారు వాళ్లు.

పోలీసులు గమనించకుండా ఒక వెకిలి నవ్వు నవ్విన కులదీప్, “నాన్న కొట్టాడు” అని గట్టిగా ఏడుస్తూ చెప్పాడు.

“అబద్ధం! కన్న తండ్రి మీద నీకు ఇంత కక్ష, కార్పణ్యం ఏమిటి? తండ్రిని ఇబ్బందులపాలు చేయాలనుకునే కొడుకుని నిన్నే చూస్తున్నా మొదటిసారి” అందామె తీక్షణంగా చూస్తూ.

కులదీప్ ఆమె మందలింపుని పట్టించుకోలేదు. కానీ పోలీసులు పట్టించుకున్నారు. కేసుని పక్కదారి పట్టించే ప్రయత్నం ఏ మాత్రం చేయవద్దని మందలించారు ఆమెను.

ఇరవై రోజుల క్రితం ఇలాగే జరిగింది. కాకపోతే ఆ రోజున గాయాలు, దెబ్బలు పడిన చిహ్నాలు కనిపించక, కుర్రతనం చేష్టగా భావించి, కుటుంబసభ్యులను బుజ్జగించి, రకరకాలుగా సముదా యించి, మందలించి, ఫస్ట్ వార్నింగ్ అంటూ వెళ్లిపోయిన ఆ పోలీసులే ఈ పోలీసులు!

పరిస్థితి విషమంగా కనిపించింది పోలీసులకు. నేరం జరిగిందని, కుర్రాడు హింసకు గురి అయ్యాడని గుర్తించారు. కుటుంబసభ్యులు ఏమీ జరగనట్లు వ్యవహరిస్తున్నారని భావించారు.

రంజిత్ సింగ్ అవాక్కయ్యాడు.

రభస అయింది. తండ్రి చేతిలో అప్పుడప్పుడు దెబ్బలు తింటాడని ఇరుగుపొరుగు పిల్లలు, పోలీసులు అడిగిందానికి జవాబుగా చెప్పారు. ఆ విషయాలు తమకు తెలీదని, ఎప్పుడూ చూడలేదని ఇరుగుపొరుగు పెద్దలు చెప్పారు.

కులదీప్‌కి ప్రథమచికిత్స చేశారు పోలీసులు. రంజిత్‌సింగ్‌తో పాటు తమ కారులో కులదీప్‌నీ తీసుకెళ్లారు, ఎవరి మాటా వినకుండా.

తరువాత స్నేహితులు, బంధువులు వచ్చారు. కేసు నడపడానికి అటార్నీని పెట్టుకుంటే వేలకువేల డాలర్లు ఫీజుగా ఖర్చు అవుతాయే తప్ప ప్రయోజనం ఉండదన్నారు. నేరం చేయకుం డానే రంజిత్

శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధ పడ్డారు. కొన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు.

కులదీప్ ఇంటికి చేరాడు. ఏమీ జరగనట్టుగా వ్యవహరించాడు.

రంజిత్‌ని కారాగారానికి తరలించారు. ఏ జైలులో ఉన్నాడో తెలుసుకునే ఆర్థికస్తోమత కూడా ఆ కుటుంబానికి లేకపోయింది.

**000**

మూడేళ్లు గడిచాయి. నేరస్థుల సంఖ్య పెరుగుతూ, జైలు ఖాళీ లేకుండా పోతున్నాయి. దాంతో శిక్షాకాలం ఇంకా ఉన్నప్పటికీ, పరివర్తన వచ్చి, మంచిగా మారినవారి కేసులను పునర్విచారణ జరిపి చాలా మందిని విడుదల చేశారు. వాళ్లలో రంజిత్‌సింగ్ ఒకడు.

రంజిత్ రాక కుటుంబసభ్యులకు ఆనందం కలిగించింది.

ఇంటికైతే చేరాడు గానీ, చేయని నేరానికి జైలు పాలైనందుకు కొడుకు పట్ల ఆగ్రహం ఎక్కువయింది. అతని మనసు నేర ప్రవృత్తికి శ్రీకారం చుట్టింది.

గుట్టుగా సంసారాన్ని ఈదుకొచ్చిన భార్య పట్ల అభిమానం, సానుభూతి పెరిగాయి. కూతురు సుగుణాల బొమ్మగా తయారై మనశ్శాంతి కలిగించింది. కొడుకు ఇంకా జులాయిగా తయారయ్యాడని గ్రహించి మధన పడ్డాడు.

**000**

హైదరాబాద్‌లో ఇళ్ల స్థలాల రేట్లు, వ్యవసాయ భూమిరేట్లు భయంకరంగా పెరిగిపోయాయని, విక్రయించేవారి పంట పండుతోందని, ఇంటర్నెట్‌లో సైట్‌ల ద్వారా తెలుసుకున్నాడు రంజిత్‌సింగ్. పిత్రార్జితమైన ఆస్తిని సొమ్ము చేసుకురావాలని తలచాడు. తనతో పాటు కొడుకుని కూడా తీసుకెళ్లాలని, కొడుకు అవసరం ఉండొచ్చునని చెప్పడంతో, భార్య అంగీకరించింది. తండ్రితో ప్రయాణం ఇష్టం లేకపోయినా, చిన్ననాటి జ్ఞాపకాలు కులదీప్ మనసుని ఉత్సాహపరిచాయి.

తెల్లవారు జామున ముంబయి నుంచి హైదరాబాద్ వస్తూ విమానం నుంచి దీపతోరణాలు, ఆకాశహర్మ్యాలు చూస్తూ ఎంత అభివృద్ధి చెందిందో అని ఆశ్చర్యపోతూ, విశేషాలు వివరించాడు కొడుక్కి.

బేగంపేట విమానాశ్రయంలో దిగి పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్ మీదుగా దుర్గమ్మ చెరువు వైపు వెడుతున్నారు. వెడల్పాటి నున్నని రోడ్లు, అంత ఎత్తుగా ఉండి అంతలోనే లోతుకు దిగిపోయే రోడ్లు , పట్టపగలుని మరిపించేలా వెలుగులు చిమ్మే వివిధరకాల విద్యుద్దీపాలు, న్యూ యార్క్, న్యూ జెర్సీ, తదితరప్రాంతాల్లో కనిపించే భవనాలకు ప్రతిరూపంగా, నిర్మించిన భవనాలు, కార్యాలయాలు, హైటెక్ సిటీ చూస్తూ బాప్ రే అనుకున్నాడు. మేరీలాండ్‌లా ఉందని, లోడీ పరిసరాల్లా వుందని,. ఎడిసన్ వీధుల్లా ఉన్నాయని, న్యూ యార్క్‌ని పోలి కనిపిస్తుందని, కనిపించిన ప్రాంతాలను వర్ణిస్తూ కొడుక్కు వివరణ ఇచ్చాడు.

భవనాలతో, కార్యాలయాలతో రూపుదిద్దుకుని బాగా అభివృద్ధి చెందడంతో తమ ఖాళీ నివేశస్థలాలని వ్యవసాయభూమిని గుర్తించడంలో కష్టపడ్డారు. రెండో రోజున కనుగొని, ఆక్రమణకి గురి కానందుకు ఆనందించారు.

నమ్మకస్తుడైన పాత స్నేహితుడి సహకారంతో మంచి రియల్టర్‌ని ఎంపిక చేసుకుని, అత్యధికధరలకి విక్రయించాడు. కొడుకుని మచ్చిక చేసుకుంటూ, స్థానికంగానే నివసిస్తున్నట్టు సర్టిఫికెట్లు సంపాదించాడు. దస్తావేజుల్లో పాస్ పోర్టు విషయం ఎత్తకుండా జాగ్రత్త పడి రిజిస్ట్రేషన్ జరిపించాడు. వచ్చిన డబ్బుని జాగ్రత్త పరిచాడు.

కులదీప్‌కి సంబంధించిన దుస్తులు, వస్తువులు విడదీసి ప్రత్యేకంగా ఒక లగేజ్ చేశాడు. తనకు సంబంధించిన వస్తువులు, బట్టలు, ఇద్దరి పాస్ పోర్ట్, వీసాలు తన లగేజీలో భద్రపరిచాడు. అప్పటి వరకూ అణిచిపెట్టుకున్న కోపం, కసి లావాలా ఎగశాయి. "తెల్లవారు జామున విమానంలో ముంబయి వెడతాం. వెంటనే అక్కణ్నుంచి నెవార్క్‌కి విమానం ఉంది మనకి" అని చెప్పాడు కులదీప్‌తో. సాయంత్రం అవుతుండగా "మనం అమ్మేసిన భూములను మళ్లీ ఒకసారి చూసుకుందాం" అంటూ టాక్సీని పిలిచి, లగేజీతో కొడుకునీ ఎక్కించాడు.

బాగా చీకటి పడ్డాక, పొలానికి సమీపంలో రోడ్ మీద టాక్సీని ఆపాడు. కొడుకుని తీసుకుని పొలంలోకి వెళ్లాడు. కోపంతో రంజిత్ ముక్కుపుటాలు అదురుతున్నాయి. చెమటలు విపరీతంగా పట్టసాగాయి. చెయ్యని నేరంలో నన్ను ఇరికించి జైలు పాలుచేసి నరకయాతన పెట్టినందుకు నీకిదే శిక్ష అనుకుంటూ బెల్ట్ తీశాడు. ముందు నడుస్తున్న కొడుకు మీద బెల్ట్ వీరవిహారం చేయసాగింది. అనుకోని సంఘటనతో, తగిలే దెబ్బలతో నివ్వెర పోయాడు కుల్‌దీప్.

"ఇప్పుడు చేయరా 911కి ఫోన్! ఆదుకుంటారు అమెరికా పోలీసులు! మళ్లీ నన్ను జైల్‌లో పడేస్తారు" అంటూ చెంపలు వాయించి, కసి తీరా కాలితో తన్ని, మళ్లీ బెల్ట్‌కి పని చెప్పాడు.

"వద్దు నాన్నా! కొట్టొద్దు నాన్నా! భారత్‌కి వచ్చాక పొరపాటు తెలుసుకున్నా. తండ్రిని బాధించే కొడుకు కొడుకే కాదని ఇక్కడికి వచ్చాక అర్థం అయింది" అని కాళ్లు పట్టుకు వేడుకున్నాడు. తండ్రి కనికరిస్తే అమెరికా వెళ్లాక ప్రతాపం చూపాలని ఆ క్షణంలోనూ అనుకున్నాడు.

"నేను కోల్పోయిన జీవితాన్ని ఆనందాన్ని నీవు తిరిగి తేగలవా? అనుభవించు, నీలో మార్పు రావాలి. వచ్చిందని తెలిశాక నీ గురించి ఆలోచిస్తా!" అంటూ, అక్కడున్న ఓ చెట్టుకి కులదీప్‌ని కట్టేశాడు భారత్‌లో కూడా పిల్లల్ని, స్త్రీలను హింసిస్తే, అమెరికా మాదిరి చట్టాలను అమలుచేయడానికి ప్రయత్నిస్తున్నారట. అలా జరిగితే అప్పుడు తనేమీ చేయలేడు. ఇప్పుడు ఇలా చేయడం మంచిదైందనుకున్నాడు.

పిలుస్తున్నా వినకుండా, విసవిసా వెళ్లిపోయాడు. వెంటనే కులదీప్ లగేజీ తీసుకొచ్చి, దాంతో పాటు కొంత డబ్బు కూడా పెట్టాడు. కట్లు ఊడదీసి కులదీప్‌కి విముక్తి కల్పించాడు. తండ్రి చేసేది అర్థం కావడం లేదు, కుల్‌దీప్‌కు.

మళ్లీ కొట్టడం ప్రారంభించాడు. గంట వరకూ కులదీప్ నడవలేడని, నడిచినా ఎక్కువ దూరం వెళ్లలేడని నిర్ధారణ చేసుకుని చరచరా వెళ్లిపోయాడు.

కష్టపడి కులదీప్ బయటకు వచ్చినా, మర్నాడు ఉదయం తొమ్మిది దాటితే గాని, అక్కడ నుంచి నగరానికి చేరుకునేందుకు వాహనాలు దొరకవని, అప్పటికి తాను నేవార్క్ విమానంలో ప్రయాణం చేస్తుంటానని రంజిత్‌సింగ్ అనుకున్నాడు. క్రమశిక్షణలో పెట్టడానికి కొట్టే హక్కు తండ్రికి ఉందనుకున్నాడు.

టాక్సీలో వెడుతూ కొడుకికి తగిన శిక్ష వేశానని అనుకున్నాడు.

కొంత సేపటికి తండ్రి హృదయం పూర్తిగా మేలుకొంది. బొటబొట కన్నీరు కార్చాడు. బాధతో ఆప్తమిత్రుడి దగ్గరకు వెళ్లి విషయం వివరించాడు.

"నిన్ను కలవడానికి తప్పక వస్తాడు. వాడిని మనిషిని చేయి. క్రమశిక్షణ, గౌరవమర్యాదలు, ప్రేమాభిమానాలు వాడిలో నిండాలి. ఎంత ఖర్చయినా పర్లేదు" అంటూ డబ్బుతో పాటు, ఆప్తమిత్రుడిని కులదీప్‌కి గార్డియన్‌గా నియమిస్తూ, వేసిన ఫిక్సెడ్ డిపాజిట్ పత్రాలు అందజేశాడు. మిత్రుడు ఇచ్చిన ఊరటతో ప్రయాణం కొనసాగించాడు రంజిత్‌సింగ్.